RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 328 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం శుక్రవారం, 31 మే 2024 పేజీలు : 4 వెల : 2/-

# రేవంత్ వారసత్వం సీతక్కకేనా?



## రేవంత్ రెడ్డి తరువాత మంత్రి సీతక్కకు పీసీసీ పగ్గాలు?

## రేసులో కాంగ్రెస్ హేమాహేమీలు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పీసీసీ ప్రెసిడెంట్ పదవి రోజురోజుకు హాట్ టాపిక్ గా మారుతోంది. పలువురు సీనియర్ నేతలు పదవి కోసం పోటీ పడుతున్నారు. బీసీ, ఎస్సీ సామాజిక వర్గంతో పాటు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలు పిసిసి పగ్గాలను చేపట్టడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. వీరితో పాటు ప్రధానంగా ఓ మహిళా నేత పేరు సైతం వినిపిస్తోంది. రాష్ట్ర గిరిజన, పంచా యతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేరు పీసీసీ చీఫ్ పదవికి గట్టిగానే వినిపిస్తుంది. మరికొద్ది రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డి పిసిసి పదవి ముగుస్తుండడంతో పీసీసీ పగ్గాలు చేపట్టేది ఎవరనే చర్చ జోరుగా సాగుతుంది.

**పలువురు నేతల మధ్య పోటీ...** కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి తర్వాత అత్యంత ప్రతిష్టాత్మకమైన పదవిగా పీసిసి పదవిని ఆ పార్టీలో చూస్తారు. ఈ పదవి కోసం వివిధ సామాజిక వర్గాల్లోని నేతలు పోటీ పడడం సహజం. అయితే ఈసారి పీసీసీ పదవి బీసీ లేదా ఎస్సీ తోపాటు గిరిజన మహిళ మధ్య పోటీ ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. పిసిసి పదవి కోసం బీసీ సామాజిక వర్గం నుండి మధు యాష్కీ గౌడ్, మహేష్ కుమార్ గౌడ్, ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అద్దంకి దయాకర్ మహబూబ్నగర్ జిల్లాకు చెందిన సంపత్ కుమార్ పేర్లు వినిపిస్తున్నాయి. ఇక రెడ్డి సామాజిక వర్గం నుండి అయితే రాష్ట్ర మంత్రివర్గంలో ఉన్న నేతలతో పాటు కీలకంగా ఉన్న నేతల పోటీపడుతున్నారు. మరోవైపు గిరిజన సామాజిక వర్గానికి చెందిన రాష్ట్ర మంత్రి సీతక్క పేరు కూడా ప్రధానంగా వినిపిస్తోంది. సీతక్క ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితురాలు కావడంతో పాటు సీతక్క పై రాహుల్ గాంధీ ప్రత్యేక దృష్టి లేకపోలేదు.

**మూడు సామాజిక వర్గాల మధ్యే పోటీ...** అయితే పీసీసీ పదవి బీసీ, ఎస్సీ సామాజిక వర్గ నేతలతో పాటు గిరిజన మహిళా మధ్య పోటి ఉంది. రాష్ట్రం, ప్రభుత్వంలో ఉన్న నేతల సామాజిక వర్గం కోణంలో బీసీ లేదా ఎస్సి సామాజిక వర్గం నేతలకు పీసీసీ పదవి దక్కుతుంది. పీసీసీ పదవి, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి కొనసాగుతున్నారు. పీసీసీ పగ్గాలు సైతం తన అనుచరుల చేతులను ఉండాలనుకుంటే అత్యంత సన్నిహితురాలిగా ఉన్న సీతక్కకు పిసిసి పగ్గాలు వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఎందుకంటే రేవంత్ రెడ్డి తో పాటు రాహుల్ గాంధీ ఆశీస్సులు సైతం సీతక్కకు ఉన్నాయి. దేశవ్యాప్తంగా జరిగిన పార్లమెంట్, వివిధ రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో సీతక్క రాహుల్ పిలుపుమేరకు ఆయా రాష్ట్రాల్లో ప్రచారంలో పాల్గొనడం జరిగింది. సీతక్క ఆదివాసి గిరిజన బిడ్డ కావడం కలిసి వచ్చే అంశం. అయితే సీతక్క మంత్రిగా కొనసాగుతూ పీసీసీ అధ్యక్షురాలుగా కొనసాగుతారా లేదా మంత్రి పదవికి నుండి తప్పించి పీసీసీ పగ్గాలు అప్పగిస్తారా అనే చర్చ సైతం సాగుతుంది. సీఎం రేవంత్ రెడ్డి చేతిలో పీసీసీ ఉండాలనుకుంటే సీతక్కకు పిసిసి పదవి ఖాయమని చెప్పవచ్చు. అయితే రెండు పదవులు ఒకరి చేతిలో ఉండడం కష్టం కాబట్టి పీసీసీ పగ్గాలు సీతక్క కట్టబెట్టి మంత్రి పదవి నుండి తప్పించవచ్చనే రాజకీయ చర్చ జరుగుతుంది. అయితే సీతక్క మాత్రం పీసీసీ రేసులో ఉన్నానని తన అనుచరులతో చెప్పుకోవడం జరుగుతుంది.


**ఉమ్మడి వరంగల్ లో ఇద్దరికి న్యాయం.!....** అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరో ప్రచారం లేకపోలేదు. సీతక్కను పీసీసీ అధ్యక్ష పదవి అప్పగిస్తే మంత్రి పదవికి రాజీనామా చేయించి ఆస్థానంలో వరంగల్ జిల్లాలో కీలకంగా ఉన్న నేతకు ఆ పదవి ఇచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సీతక్కతో పాటు వరంగల్ జిల్లాకు చెందిన మరోనేత సన్నిహితులు కావడంతో పగ్గాలు సీతక్క కు, మంత్రి పదవి కొత్తగా పార్టీలోకి వచ్చిన మరి సన్నిహిత నేతకు ఇస్తే ఇద్దరికి న్యాయం చేసినట్టు ఉంటుందని రేవంత్ రెడ్డి ఆలోచన చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.

**రెండు పదవులు అయితేనే ఒకే..?...** అయితే సీతక్క మంత్రిగా ఉన్నా, లేకపోయినా నిత్యం జనాల్లో తిరిగే వ్యక్తి. పీసీసీ పగ్గాలు చేపడితే జనాల్లో తిరగడం కష్టం కాబట్టి సీతక్క మంత్రి పదవితో పాటు పిసిసి పగ్గాలు రెండు పదవులు ఉండాలని కోరుకున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతుంది. ఎస్సీ, బీసీ రెండు సామాజిక వర్గాలకు కాదంటే సీతక్కకు పిసిసి పగ్గాలు ఖాయమని చెప్పవచ్చు. ఏది ఏమైనా మరికొన్ని రోజుల్లో తేలనుంది.

# జులైలో కులగణన.. బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ల కసరత్తు

## ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత గైడ్‌లైన్స్ ఖరారు

## బీసీ, ప్రజా సంఘాలు, పార్టీల నుంచి అభిప్రాయ సేకరణ



హైదరాబాద్ : రాష్ట్రంలో కులగణన చేపట్టేందుకు బీసీ వెల్ఫేర్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత గైడ్?లైన్స్ ఖరారు చేయనున్నారు. అంతకంటే ముందు బీసీ, ప్రజాసంఘాలు, పార్టీల నుంచి సలహాలు, సూచనలు తీసుకోనున్నారు. మరో వారం రోజుల్లో ఎన్నికల కోడ్ ముగియనున్న నేపథ్యంలో అప్పటి వరకు గ్రౌండ్ వర్క్ పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత సీఎం రేవంత్ రెడ్డితో మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశమై గైడ్ లైన్స్ పై చర్చించనున్నట్టు తెలిసింది. అన్ని అనుకున్నట్టు జరిగితే జులైలో కులగణన ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. కులగణన కోసం అధికారులకు ట్రైనింగ్ ఇచ్చే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నదని ఉన్నతాధికారులు అంటున్నారు. కులగణనకు తక్కువే టైమ్ పడుతుందని, అయితే అంతకుముందు చేయాల్సిన ప్రాసెస్ కే ఎక్కువ టైమ్ పడుతుందని పేర్కొంటున్నారు.

**అందరి అభిప్రాయాలతో ముందుకు..** మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా కులగణన చేపట్టాల ని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. దీనిపై జీవో కూడా విడుదల చేసింది. రూ.150 కోట్లు విడుదల చేసేందుకు పరిపాలన అనుమతులు ఇచ్చింది. దీంతో కులగణన ప్రక్రియపై బీసీ వెల్ఫేర్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత గైడ్ లైన్స్ ఖరారు చేస్తామని, అంతకంటే ముందు బీసీ సంఘాలు, ప్రజాసంఘాలు, పార్టీలు, మేధావులు, ప్రొఫెసర్ల సలహాలు తీసుకుంటామని చెబుతున్నారు. 2014లో అప్పటి ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేపట్టింది. కానీ ఆ వివరాలను అధికారికంగా వెల్లడించలేదు. సమగ్ర కుటుంబ సర్వే వివరాలను విడుదల చేయాలని బీసీ సంఘాలు, పార్టీలు కోరినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో అందరి సలహాలు, సూచనలు తీసుకుని అవసరమైతే ఆల్ పార్టీ మీటింగ్ పెట్టి కులగణన ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది.

**కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి..** కులగణన తర్వాతే లోకల్ బాడీల ఎన్నిక లు నిర్వహించాలి. కులగణనతో రాష్ట్రంలో ఎన్ని కులాలున్నా యి? వారి ఆర్థిక పరిస్థితి ఏమిటి? అనేది తెలుస్తుంది. ఇది అన్ని కులాలకు సంబంధించి ఎక్స్ రే లాంటిది. జనగణన మాదిరిగానే కులగణన చేయాలి. దీనిపై ప్రభుత్వ ఆఫీసర్లకు ట్రైనింగ్ ఇవ్వాలి. 35 అంశాలను ఖరారు చేసిలో కులగణన చేపట్టాలి. ఇందుకోసం బీసీ కమిషన్ సాయం తీసుకోవాలి. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కులగణనపై మా సలహాలు, సూచనలు ఇస్తాం. **– ఆర్ కృష్ణయ్య, ఎంపీ,**

**లోకల్ బాడీ ఎన్నికలపై ఎఫెక్ట్ :** రాష్ట్రంలో గ్రామ పంచాయతీల టర్మ్ ఈ ఏడాది ఫిబ్రవరి 1న ముగిసింది. ఎంపీ ఎన్నికలు ఉండడంతో స్పెషల్ ఆఫీసర్ల పాలనను ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఇప్పుడు జులైలో ఎంపీటీసీ, జడ్పీటీసీల టర్మ్ కూడా ముగియనుంది. తర్వాత మున్సిపాలిటీల టర్మ్ ముగియనుంది. అయితే కులగణన పూర్తయిన తర్వాతే లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తుండటంతో ప్రభుత్వంతో కూడా అదే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తున్నది. బీఆర్ఎస్ సర్కార్ హయాంలో లోకల్ బాడీల్లో బీసీ రిజర్వేషన్లను తగ్గించారని, కులగణన చేపట్టి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.




## తెలంగాణ కొత్త లోగో ఆవిష్కరణ వాయిదా.. ఎందుకంటే..?

హైదరాబాద్: తెలంగాణ కొత్త లోగో (కొత్త రాజముద్ర) దాదాపు ఖరారయ్యిందని గత 24 గంటలుగా హడావుడి జరిగిన సంగతి తెలిసిందే. అదిగో ఇదిగో రిలీజ్ అంటూ కాంగ్రెస్ నేతల మాటలు.. ఇక సోషల్ మీడియాలో అయితే ఇదిగో ఇదే ఫైనల్ అని ఫొటోలు తెగ వైరల్ అయ్యాయి. అయితే.. తెలంగాణ కొత్త రాజముద్ర ఆవిష్కరణ వాయిదా పడింది. తొలుత జూన్- 2 రిలీజ్ చేయాలని భావించిన కాంగ్రెస్ సర్కార్ ఇప్పుడు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. జూన్-02న కాకుండా మరో రోజున రిలీజ్ చేయాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. దీనిపై ఉన్నతాధికారులు సీఎం రేవంత్ రెడ్డితో సంప్రదింపులు జరుపుతున్నారు. అయితే.. తెలంగాణ గీతం మాత్రమే జూన్-02నే విడుదల చేస్తారని తెలుస్తోంది. అయితే ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, తెలంగాణ ప్రజల్లో ఓ వర్గం నుంచి వస్తున్న వ్యతిరేకతతో ప్రభుత్వం పునరాలోచనలో పడిందనే టాక్ కూడా గట్టిగానే నడుస్తోంది.

**కొత్త లోగోలో ఏముంది..? :** కాగా.. కొత్త లోగోలో కాకతీయ తోరణం, చార్మినార్ స్థానంలో అమరవీరుల స్థూపానికి రేవంత్ రెడ్డి సర్కార్ అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది.

చట్టానికి, న్యాయానికి, ధర్మానికి ప్రతీకలైన మూడు సింహాల లోగోను పైభాగంలో పొందుపరిచినట్లు కొన్ని చిత్రాలు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ఈ లోగోనే రేవంత్ ప్రభుత్వం దాదాపు ఖరారు చేసిందని వార్తలు గుప్పుమన్నాయి. మొత్తం 40కిపైగా డిజైన్లను కాంగ్రెస్ సర్కార్ పరిశీలించగా.. ఒక్కటి మాత్రం ఫైనల్ చేసిందని టాక్. మరో రెండు రోజుల్లో అవతరణ ఉత్సవాల నేపథ్యంలో రిలీజ్ చేయాలని నిర్ణయించినప్పటికీ వాయిదా వేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించడం జరిగింది.



# రైతులకు ప్రభుత్వం కీలక ప్రకటన

## తల్లిదండ్రుల,తాతల పేరు మీద ఉన్న పహాణి భూములు

## సులభంగా బదిలీ!!!

హైదరాబాద్: రాష్ట్ర రెవిన్యూ మంత్రి రాష్ట్ర రైతులందరికీ కూడా ఒక తీపి శుభవార్త తెలిపారు. నేటికీ రాష్ట్ర రైతులు తల్లిదండ్రులు లేక తాతల పేరు మీద ఉన్న పహాణి భూములను విక్రయిస్తున్నారు అని అలాంటి రైతులకు ఒక మార్గం ప్రకటించారు. చాలా సులువుగా వారి పేరు మీద పహాణి పొందవచ్చు. మా భూమి కి సంబంధించినటువంటి దస్తవేజులు తల్లిదండ్రులు లేక తాతయ్యల పేరు మీద ఉన్నట్లయితే దానిని మా పేరుకు బదిలీ చేసేందుకు పత్రాలు లేకుంటే లేదా ఆస్తికి సంబంధించినటువంటి వ్యక్తి మరణించినట్లయితే దానిని మా పేరుకు ఎలా బదిలీ చేస్తారు అనే వివరాలు ఇప్పుడు మనం తెలుసుకుందాం.. రైతులకు ప్రభుత్వం నుండి బంపర్ సహకారం : రైతులు అందరికీ కర్ణాటక రెవెన్యూ మంత్రి కృష్ణ బైర గౌడ బంపర్ గిఫ్ట్ తీసుకు వచ్చారు. రైతు భూమి గుండ గోవులు వెళ్లే రోడ్డు, నీటి కాపలా,వాగు, కంచె భూమిలో ఉన్న చెట్లు నా భూమికి వస్తాయాని,ఇది నా వాట అని రైతులు గొడవకు దిగిన సందర్భాలు కూడా ఎన్నో ఉన్నాయి. కావున ఈ సమస్యలను పరిష్కరించటానికి రాష్ట్ర వ్యాప్తంగా రైతులు అందరూ కూడా భూపత్రాల ధ్రువీకరణ పత్రాలను కూడా డిజిటలైజేషన్ చేయాలి అని రెవెన్యూ మంత్రి తెలిపారు.. భూ సర్వే ఇక నుండి డిజిటల్ రూపంలో కూడా ఉంటుంది : భూమి విరాళం, కొనుగోలు విభజన రూపంలో లేక పౌతి ఖాతాలో వారసత్వ రూపంలో ఒక రైతు నుండి మరొకరికి ఆస్తి మార్పు అనేది ఉంటుంది. అంతకు ముందు ఈ సమాచారం అంతా పేపర్ రూపంలోనే ఉంచారు. కానీ ఎవరికి ఎంత భూమి ఇస్తారు అనేది మాత్రం కచ్చితంగా తెలపలేదు. అందుకే ఈ సమస్యలు అన్నింటిని కూడా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కాడాస్ట్రల్ రిజిస్టర్ డిజిటలేజ్ చేయాలి అని నిర్ణయించింది..

**ఈ పత్రములు పహాణి ని సులభంగా బదిలీ చేయండి :** భూమి యజమాని తన భూమికి సంబంధించిన మొత్తం సమాచారాన్ని కూడా మొబైల్ ఫోన్ లోనే తెలుసుకునేలా రాష్ట్ర ప్రభుత్వ రైతులకు ఒక సేవను అందిస్తుంది. తొందరలో రైతుల భూముల సమాచార కొలతలు డిజిటల్ రూపంలో స్కాన్ చేసి మరి భద్రపరచాలి అని రెవెన్యూ శాఖ సూచిస్తుంది. ఈ ప్రక్రియ అనేది 2024 నాటికి పూర్తి చెయ్యాలి అని రెవెన్యూ శాఖ తన లక్ష్యంగా పెట్టుకున్నది. ఇకనుండి రాష్ట్రంలోని రైతులు అందరూ భూముల సమాచారం డిజిటల్ రూపంలో అందుబాటులోకి వస్తాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో ఈ పనిని అమలు చేశాము అని, రైతుల భూములను డిజిటల్ స్కాన్ చేసి పత్రాల సేకరణ అనేది జరుగుతుంది అన్నారు. రైతులు తమ మొబైల్ లో భూమికి సంబంధించిన అన్ని వివరాలను కూడా తెలుసుకునేందుకు మరియు పహాణి మీ తండ్రి లేక తాత పేరు మీద ఉండి,వారు గనక మరణించినట్లయితే మరణ ధ్రువీకరణ పత్రాన్ని కూడా అందించాలి. దీని ద్వారా సులభంగా మీ పేరుకు బదిలీ చేసుకోవచ్చు..

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## షర్మిల గెలుపునకు ఆ ఓటింగ్ విధానమే అడ్డు వస్తోందా ?

ఏపీలో ఈసారి జరిగిన ఎన్నికల్లో అనేక ఆసక్తికరమైన అంశాలు ఉన్నాయి. చట్ట సభలలో అడుగు పెడదామని ముగ్గురు కీలక నేతలు ఈసారి గట్టి ప్రయత్నం చేశారు. వారిలో ఇద్దరు గతంలో పోటీ చేసి ఓడారు. వారిది రెండవ ప్రయత్నం. అదే సమయంలో వైఎస్ షర్మిలకు ఈసారి ఏపీలో కడప లోక్ సభ నుంచి పోటీ చేయడం తొలి ప్రయత్నం. ఇక పవన్ కళ్యాణ్, నారా లోకేష్ రెండవ సారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇవన్నీ పక్కన పెడితే ఈ ముగ్గురూ ఈసారి గెలుస్తారా లేదా అన్న అంశం మాత్రం చర్చనీయాంశంగా ఉంది. వీరి మీద సోషల్ మీడియాలో వచ్చే వార్తలు తెగ వైరల్ అవుతున్నాయి. ఇదిలా ఉంటే 2024 లో ఏపీలో జరిగిన ఎన్నికల్లో షర్మిల సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ అయింది. అంతే కాదు కడపలో వైఎస్ రాజారెడ్డి కుటుంబం రెండుగా చీలడం ఈసారి ఎన్నికల్లోనే జరిగింది. షర్మిల సునీత జగన్ తో విభేదించి వేరుగా కాంగ్రెస్ తరఫున రంగంలో నిలబడ్డారు. షర్మిల పోటీ చేస్తే సునీత ప్రచారం చేస్తూ మద్దతుగా నిలిచారు. ఇలా ఒక ప్రముఖ రాజకీయ కుటుంబం రెండుగా చీలిపోవడం ఈసారి అతి పెద్ద విషయంగానే మారింది. మామూలుగా అయితే వైఎస్సార్ ఉంటే ఎలాంటి సమస్యలు కుటుంబంలో వచ్చినా సర్దుబాటు చేసేవారు అని చెబుతారు. మరి వైఎస్సార్ వారసత్వాన్ని తీసుకుని వైఎస్సార్ కుటుంబంలో ఇబ్బందులు లేకుండా చూడాల్సిన వేళ ఆ సర్దుబాటు ఎందుకు చేయలేకపోయారు అన్నదే చర్చగా ఉంది. నిజానికి జగన్ అందరికీ కూర్చోబెట్టి సర్దుబాటు చేసి ఉంటే సెట్ అయ్యేది అని అంటున్నారు. అయితే జగన్ అలా చేయడానికి ఇష్టపడలేదని వైఎస్సార్ కుటుంబ సభ్యులే చర్చించుకుంటున్న పరిస్థితి ఉంది అంటున్నారు. ఇక ఇటీవల పోలింగ్ అనంతరం చేసిన ఒక సర్వేలో పులివెందులలో ఒక ఓటు జగన్ కి మరో వోటు షర్మిలకు వేశామని చెప్పారని వెల్లడి అయింది. అందులో ఎంత నిజం ఉందో తెలియదు. కానీ ఒక వేళ ఆ సర్వే కనుక నిజం అయితే మాత్రం షర్మిలకు విజయావకాశాలు కచ్చితంగా ఉంటాయని అంటున్నారు. అయితే ఎన్నికల ప్రచారం నేపథ్యంలో ఆ మధ్య ఒక ప్రముఖ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జగన్ మాట్లాడుతూ తన చెల్లెలుకు కడప ఎంపీ సీటులో డిపాజిట్ వచ్చే అవకాశం లేదని తేల్చేశారు. అలాంటిది జరిగితే తనకు చాలా బాధగా ఉంటుందని కూడా జగన్ చెప్పుకొచ్చారు. కానీ జగన్ చెప్పిన దానికి భిన్నంగా షర్మిలకు మంచిగానే ఓట్లు పడతాయని సర్వే నివేదికలు చెబుతున్నాయి. అయితే ఓటింగ్ పాటర్న్ ఈసారి మారింది. దాని వల్ల ఇబ్బంది అయింది అని అంటున్నారు. 2019లో ఎన్నికల్లో చూస్తే మొదటి ఓటు ఎమ్మెల్యేకు రెండవ ఓటు ఎంపీకి వేశారు. ఈసారి మాత్రం ఆ పాటర్న్ మారింది. మొదట ఓటు ఎమ్మెల్యేకు రెండవ ఓటు ఎంపీగా మార్చారు. దాంతోనే ఇపుడు షర్మిలకు ఇబ్బంది అవుతుందా అన్న చర్చ సాగుతోంది. అదెలా అంటే ఈసారి మొదటి ఓటు జగన్ కి వేసిన వారు రెండవ ఓటు ఎంపీకి వేయాలనుకున్నా ఈ పాటర్న్ అర్థం కాకపోవడం వల్ల క్రాస్ ఓటింగ్ జరిగింది అని అంటున్నారు. దాంతో ఎవరికి ఏ ఓటు పడింది అన్నది పెద్ద ఎత్తున చర్చకు తావిస్తోంది. ఇక 2019 నాటి పాటర్న్ ఉండి ఉంటే షర్మిల కచ్చితంగా గెలిచేది అన్న మాట ఇపుడు వినిపిస్తోంది. ఇవన్నీ పక్కన పెడితే షర్మిల ఈసారి గెలవాలి అని కోరుకునే వారు ఎక్కువగానే ఉన్నారు అన్నది తెలుస్తోంది. మరో వైపు టీడీపీ వారు కూడా ఈసారి షర్మిల గెలిస్తే బాగుంటుంది అని అంటున్నారుట. దీంతో షర్మిల మీద బాగానే బెట్టింగులు నడుస్తున్నాయని అంటున్నారు. అయితే ఈ క్రాస్ ఓటింగ్ అన్నది వైసీపీ వైపు నుంచే కాకుండా టీడీపీ వైపు నుంచి కూడా జరిగింది అని అంటున్నారు. దాంతో షర్మిలకు రెండిందాలా రాజకీయ లాభం జరిగి అనూహ్యంగా గెలుస్తుందా అన్న చర్చ కూడా ఉంది. ఏది ఏమైనా కడపలో షర్మిల గెలిస్తే మాత్రం అది అత్యంత సంచలన పరిణామమే కాదు మొత్తం ఏపీ రాజకీయాలు సమూలంగా మారిపోతాయని కూడా చెప్పక తప్పదు అంటున్నారు.

# మనం ఎంత భద్రం!



కరీంనగర్ : వచ్చేది వానాకాలం.. తుపాన్ల కారణంగా బలమైన గాలులు వీస్తాయి. వారం రోజుల కిందట సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఆసుపత్రి వద్ద చెట్టు కూలడంతో భర్త మృతి చెందగా, భార్యకు తీవ్రగాయాలయ్యాయి. ఆ ఘటన మరవకముందే ఆదివారం గాలివాన బీభత్సానికి రాష్ట్ర వ్యాప్తంగా స్తంభాలు, చెట్లు, హోర్డింగ్‌లు కూలడంతో 13 మంది దుర్మరణం చెందారు. ఆ ఘటనలను చూసి.. ఎంతోమంది అయ్యో అని ఆవేదన వ్యక్తం చేశారు. మన కరీంనగర్ జిల్లాలోనూ కూలడానికి సిద్ధంగా చెట్లు, స్తంభాలు, బోర్డులు ఉన్నాయి. ఈ ఘటనలను దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం అప్రమత్తం కాకుంటే మన వద్ద కూడా ఇలాంటివి చోటు చేసుకునే అవకాశముంది. అధికారులు మేల్కొని పడిపోవడానికి సిద్ధంగా ఉన్న వాటిని తొలగిస్తే ప్రమాదాలకు అడ్డుకట్ట పడుతుంది. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' జిల్లా పంచాయతీ అధికారి ఎ.రవీందర్‌ను వివరణ కోరగా.. ప్రమాదకర ఇళ్లు, చెట్లు, విద్యుత్తు స్తంభాలు, హోర్డింగ్‌లను మూడు రోజుల్లోగా గుర్తించాలని క్షేత్రస్థాయి అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. అవసరమైన చోట వాటిని తొలగించాలని సూచించామని తెలిపారు.

రహదారిపై ఒరిగిన చెట్టురామడుగు మండలం వెదిర అనుబంధ గ్రామం వెంకటగిరి రైల్వే గేటు సమీపంలో చింతచెట్టు రోడ్డు వైపు ఒరిగింది. రెండేళ్ల కింద చెట్టు అడుగు భాగంలో పిడుగుపడి క్రమంగా రోడ్డు వైపు ఒరుగుతోంది. నిత్యం వందలాది వాహనాలు వెళ్లే దారిలో చెట్టు ఎప్పుడు పడిపోతుం దోనని భయంగా జనం వెళ్తున్నారు.

ఎండిన వృక్షం

శంకరపట్నం మండలం మొలంగూర్ అడ్డరోడ్డు నుంచి వీణవంక, జమ్మికుంట వెళ్లే దారిలో ఓ విత్తన కంపెనీ ముందు ఎండిన చెట్టుతో ప్రమాదం పొంచి ఉంది. నిత్యం ఈ రోడ్డుపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే లారీలు నిలుపుతుంటారు. శంకరపట్నం

గాలులు వీస్తే..మానకొండూర్ చెరువు కట్ట కింద రహదారి వెంబడి ఓ చెట్టు ఎండిపోయి కూలడానికి సిద్ధంగా ఉంది. బలమైన గాలులు వేస్తే విరిగే ప్రమాదం ఉంది. జాతీయ రహదారి కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. మానకొండూర్

శిథిలావస్థలో హోర్డింగ్

చొప్పదండి శివారులోని గుమ్లాపూర్ అడ్డరోడ్డు సమీపంలో ఉన్న ఓ హోర్డింగ్ కొంతభాగం విరిగి ప్రమాదకరంగా తయారైంది. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. చొప్పదండి

ఆధారం లేని పాఠశాల బోర్డు..

కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడు ప్రాథమిక ఉన్నత పాఠశాల ముందు ఉన్న నామఫలకమిది. కింద స్తంభాలకు ఎలాంటి ఆధారం లేదు. ప్రహరీ ఆధారంగా బోర్డు నిలిపారు. గాలి దుమారం వస్తే.. ఎగిరి మీద పడే ప్రమాదముంది. కరీంనగర్ గ్రామీణం

ప్రమాదకరంగా..చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ గ్రామశివారులో రాష్ట్ర రహదారికి ఆనుకుని పలు చెట్లు ఎండిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. నెల కిందట కొన్ని చెట్లను నరికివేసినా వీటిని మాత్రం అలాగే వదిలేశారు. అవి ఎప్పుడు విరిగి రహదారిపై పడుతాయోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. చొప్పదండి

# ఈసారైనా దోమతెరలు పంపిణీ చేస్తారా..?



టేకులపల్లి : మరికొద్ది రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానుంది. ఇప్పటికే అడపాదడపా కురుస్తున్న వానలకు కొన్ని పల్లెల్లో పారిశుధ్య ఇబ్బందులు మొదలయ్యాయి. ఏటా వానాకాలంలో గ్రామాలు, పట్టణాల్లో అపరిశుభ్ర వాతావరణం కారణంగా దోమలు విజృంభిస్తున్నాయి. పల్లెజనం, ముఖ్యంగా ఆదివాసీ గ్రామాల్లోని ప్రజానీకం మలేరియా, డెంగీ వంటి వ్యాధులతో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో దోమకాటు నుంచి ప్రజలను రక్షించేందుకు మలేరియా ప్రభావిత గ్రామాల్లో ప్రతి మూడేళ్లకోసారి దోమ తెరలు పంపిణీ చేయాలి. నిజానికి గతేడాదే వీటిని అందించాలి. ఈ ఏడాదైనా పంపిణీ చేస్తారా? లేదా? అనే విషయంపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారుల వద్ద స్పష్టమైన సమాచారం లేదు.

మూడేళ్లకోసారి..

ఏజెన్సీ జిల్లా అయిన భద్రాద్రిలో ఏటా మలేరియా ప్రభావిత గ్రామాల సంఖ్య తగ్గుతుండటం శుభపరిణామమే. 2021లో జిల్లాలో 293 గ్రామాలను మలేరియా ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించగా, 2022లో ఆ సంఖ్య 278కు, 2023 నాటికి 240కు తగ్గిపోయింది. ఈ ఏడాది మరింత తగ్గే అవకాశం ఉంది. కేంద్ర ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 2020లో 1.60 లక్షల దోమతెరలు మంజూరయ్యాయి. రెండేళ్ల వ్యవధిలో 1.50 లక్షల దోమ తెరలు పంపిణీ చేశారు. బఫర్ కింద నిల్వ ఉంచిన 10వేల దోమ తెరలను వరదల సమయంలో వినియోగించారు. కేంద్ర ఆరోగ్య శాఖ సరఫరా చేసే దోమ తెరలకు రసాయన పూత ఉంటుంది. మూడేళ్లపాటు ఈ పూత వల్ల దోమలు తెర దరి చేరే అవకాశం ఉండదు. ఆ తర్వాత మళ్లీ కొత్తవి అందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం మేనెల పూర్తి కావొస్తుంది. మరికొద్దిరోజుల్లో రుతుపవనాలు ప్రవేశించనున్నాయి. జూన్ చివరి నాటికి వానలు అధికమవుతాయి. ఈలోగా దోమ తెరలు పంపిణీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. దోమ తెరలు కేంద్ర ఆరోగ్య శాఖ నుంచి రావాల్సి ఉంది. ప్రతి మూడేళ్లకోసారి అందించాల్సి ఉంటుంది. ఈ ఏడాది పంపిణీకి సంబంధించి ప్రస్తుతానికి ఎలాంటి సమాచారం లేదు. జేవీఎల్ శిరిష, డీఎంహెచ్ఓ

# ఈ దవాఖానా.. గిరిజన తెగల ప్రత్యేకం

కొత్తగూడెం : అదో మారుమూల గిరిజన గూడెం. పరిస్థితి విషమంగా ఉన్న ఓ గర్భిణిని జెట్టీలో మోసుకెళ్లే కథనం ఓ యువ వైద్యుణ్ని చలింపజేసింది. అప్పట్నుంచి ఆయన మదిలో ఒకటే ప్రశ్న మెదిలేది. 'అడవి బిడ్డలకు ఏమైనా చేయగలనా..?' అని! ఆ ఆలోచనల నుంచి పురుడుపోసుకున్నదే 'ఐ–డూ(ఇండిజెనోస్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్). కొండకోనల్లో విసిరేసినట్టు ఉండే ఆదిమజాతుల సమూహాలకు ఉచిత వైద్యం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.. డా.ఆర్.నరేందర్.

నరేందర్ బీహెచ్ఎంఎస్ కోర్సును 2011లో హైదరాబాద్‌లో పూర్తిచేశారు. కొన్నాళ్లు అక్కడే ప్రాక్టీస్ కొనసాగించారు. స్వగ్రామం నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ కాగా, విద్యాభ్యాసం దాదాపు హైదరాబాద్‌లోనే కొనసాగింది కొన్నాళ్లకు ఎంబీబీఎస్, ఎం.ఎస్.(గైనకాలజిస్ట్) డా.స్వాతితో వివాహమైంది. కొండ ప్రాంతాల్లో నాటు, పసరు వైద్యం, మూఢనమ్మకాలతో ప్రాణాల మీదకు తెచ్చుకునే ఆదివాసీల వ్యథలు ఆయన్నెంతగానో కదిలించేవి. ఈ క్రమంలో వారికేదైనా చేయాలనే ఆలోచన వైద్య విద్యాభ్యాసం నాటినుంచే ఆయనకు ఉండేది. పెళ్లయిన కొన్నాళ్లకే ఈ విషయాన్ని తన సతీమణితో పంచుకున్నారు. ఆమె సహకారంతో 2017లో మహబూబ్‌నగర్‌లోని నల్లమల, ఆదిలాబాద్‌లోని గిరిజన గూడేల సందర్శనకు తొలిసారి వెళ్లారు. కొన్నాళ్లు గిరిజనులకు వైద్య సాయమందించారు. అదే సమయంలో ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలంలోని కొత్తమెట్టుపల్లి అనే ఆదివాసీ గూడెం వాసుల వైద్య కష్టాలపై ఓ దినపత్రికలో వచ్చిన కథనాన్ని చూసి చలించిపోయారు. మరో ఇద్దరు స్నేహితులతో కలిసి వెంటనే ఆ ఊరికి వెళ్లారు. డెబ్భై కుటుంబాలున్న గూడెంలో స్థానికులకు తగిన వైద్య సేవలందించారు. ఇంతకంటే కష్టాలెదురొడ్డే గిరిజన జాతులెన్నో ఉన్నాయన్న స్థానికుల సమాచారంతో నరేందర్ ప్రయాణం పాల్వంచ మండలంలోని ఛత్తీస్‌గఢ్ వలస గొత్తికోయల గ్రామం రాళ్లచెలక వైపు సాగింది. ఊరి జనానికి వైద్యం అందించేలా ఓ ఆరోగ్య వాలంటీర్‌ను ఏర్పాటు చేశారు. చిన్న పెంకుటిల్లును ఆసుపత్రిగా మార్చి.. నాలుగైదేళ్ల పాటు చుట్టుపక్కల వారికి వైద్య సేవలందించారు. చివరకు నాటు వైద్యం మానుకుని గిరిజనులంతా ఆసుపత్రిని ఆశ్రయించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో స్నేహితులు, వైద్య ప్రముఖులు, వ్యాపారులు తన కలల ప్రాజెక్టు 'ఐ–డూ'ను మూడేళ్ల క్రితం ప్రారంభించారు.

మారుమూల గూడెంలో.. కార్పొరేట్ హంగులతో

లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమళ్లలో ఎకరా స్థలంలో 'ఐ–డూ (ఇండిజీనోస్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్)' ఆసుపత్రి నిర్మాణాన్ని డా.నరేందర్ 2021లో ప్రారంభించారు. మట్టి చదును, గోడల నిర్మాణాలకు 9 వేల మంది వలస గిరిజనులు వంతుల వారీగా సహకరించడం విశేషం. గతేడాది నిర్మాణాన్ని




పూర్తిచేసుకున్న అధునాతన దవాఖానాలో ఆపరేషన్ థియేటర్(స్టాండర్డ్ ఆపరేటివ్ ప్రొటోకాల్), ల్యాబ్, ఆరు పడకల వార్డు, కాన్పుల గది, రోగి సహాయకుల కేంద్రాలున్నాయి. అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఈసీజీ, రక్త పరీక్షలు, ఔషధాలన్నీ రోగులకు ఉచితంగా అందిస్తున్నారు. ఏపీ, తెలంగాణతో పాటు ఛత్తీస్‌గఢ్ నుంచి రోజుకు డెబ్భై మందికి పైగా రోగులు వస్తుంటారు. డా.నరేందర్‌తో పాటు ఆమె సతీమణి, విశ్రాంత వైద్యుడు డా.సంజీవరావు, డా.కపిల్ శర్మ, డా.వినోద్, పారా మెడికల్ సిబ్బంది సహా 12మంది నిరంతర వైద్య సేవలందిస్తున్నారు. దవాఖానా ఆధ్వర్యంలో మరో సంచార వైద్యశాల సేవలందిస్తోంది. ఓ బృందం రోజూ గూడేలకు వెళ్లి శిబిరాలు నిర్వహిస్తుంది. దీని పరిధిలోని 72 గిరిజన గ్రామాల్లోనూ వాలంటీర్లు సేవలందిస్తున్నారు. వీరి ప్రోత్సాహంతో ఆసుపత్రిలో సురక్షిత కాన్పులు ఎక్కువగా జరుగుతున్నాయి. పాల్వంచ, కొత్తగూడెంకు చెందిన వైద్యులు తీరిక సమయాల్లో ఉచిత సేవలందిస్తున్నారు. కొత్తగూడెంకు చెందిన ఓ వైద్య నిపుణుడు ఆపరేషన్ కేసులకు అనస్తీషియా ఉచితంగా ఇస్తుండటం విశేషం. హైదరాబాద్ కేంద్రంగా సంస్థను నమోదు చేయగా.. సభ్యుల్లో ప్రముఖ వైద్యులు, వ్యాపారులైన డా.సురేశ్‌రెడ్డి, డా.రవీందర్, విజేందర్, మహేశ్, రాధాకృష్ణ, మల్లికార్జున్ తదితరులున్నారు. వీరు విరాళాలు సమకూర్చుతున్నారు. ఆసుపత్రిని ప్రారంభించిన 'రైట్ లైవ్లీహుడ్', 'పద్మశ్రీ', కర్ణాటకకు చెందిన డా.హనుమప్ప సుదర్శన్ సంచార వైద్యశాల నిర్వహణకు సహకారాన్ని అందిస్తున్నారు. 'గిరిజన ప్రాంత గర్భిణుల్లో కాన్పులపై చైతన్యం వచ్చింది. వారంతా ఆసుపత్రుల్లో కాన్పులు చేయించుకుంటున్నారు. రక్తహీనత కేసులు చాలా తగ్గాయి. మన్యంలో ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతానికి ఆసుపత్రి నెట్‌వర్క్ నమూనాగా ఉపయోగపడుతుంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో సేవల విస్తరణే తదుపరి లక్ష్యం.' డా.నరేందర్

# రాజకీయం రాజుకుంది.. మిల్లర్లకు చుట్టుకుంది

హుజూర్‌నగర్ : ఆరోపణలు, ప్రత్యారోపణల నడుమ సీఎంఆర్ రాజకీయాలు గరంగరంగా మారాయి. నాయకుల మధ్య సీఎంఆర్ ఆరోపణలు, ప్రత్యారోపణలు బకాయి ఉన్న మిల్లర్ల మెడకు చుట్టుకుంటున్నాయి. మిల్లుల మీద ఇటీవల దాడి చేసి దాదాపు రూ.200 కోట్ల విలువ చేసే ధాన్యం లేని కారణంగా మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమనర్సయ్యను నాటకీయ పరిణామాల మధ్య అరెస్ట్ చేశారు. నర్సయ్యను అరెస్ట్ చేయడం రైస్ మిల్లర్స్ వర్గాలలో పెద్ద చర్చనీయాంశమైంది. ముఖ్యంగా పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూర్యాపేట జిల్లాకు చెందిన వ్యక్తి కావడంతో అందరి దృష్టి ఈ జిల్లాపై పడింది. దీంతో బకాయి దారులపై కఠిన చర్యలకు యంత్రాంగం సిద్ధమైంది.

అధికారులు, మిల్లర్ల అప్రమత్తం..

ఉమ్మడి జిల్లాలో సూర్యాపేట జిల్లాలోనే అధికంగా బకాయి ఉన్నట్లు అధికారులు అంటున్నారు. రాష్ట్రస్థాయిలోని బకాయిల జాబితాలోనూ జిల్లా చోటు చేసుకుంటుందని సమాచారం. జిల్లాలో 16 మంది బకాయిదారులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వారికి యాసంగి ధాన్యం కేటాయింపులు లేకుండా నిలుపుదల చేశారు. వారే బినామీ



పేర్లతో ధాన్యం కేటాయింపులు చేయించుకున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఉన్న 16 మంది బకాయిదారుల్లచి గత యాసంగి బియ్యం కూడా పెట్టాల్సిన వారు ఉన్నారు. గత యాసంగి టెండర్‌లు దక్కించుకున్న మరికొందరిలో ధాన్యం అప్పగించని వారు కూడా ఉన్నారు. వీటిపై అధికారుల హడావుడి జరుగుతోంది. మిల్లర్లు కూడా అప్రమత్తం అవుతున్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు అరెస్టులు చేయకుండా సామరస్యంగా బియ్యం వసూలు చేయాలని ప్రభుత్వం ఆలోచన చేసింది. కానీ భాజపా నాయకులు సీఎంఆర్ విషయంలో అనేక అవకతవకలు జరిగినట్లు మొదట ఆరోపించగా, తాజాగా భారాస నాయకులు సైతం ప్రభుత్వంపై విరుచుకుపడటంతో వ్యవహారం మిల్లర్ల మెడకు చుట్టుకున్నట్లు అయింది. ప్రభుత్వం తక్షణమే నిజాయతీ నిరూపించుకునేందుకు బకాయిదారులపై చర్యలు తీసుకునే పద్ధతిలో పావులు కదపడంతో మిల్లర్లలో హడావుడి ప్రారంభమైంది. కొద్దిపాటి బకాయిలు ఉన్న మిల్లర్లు తక్షణమే బకాయిలు చెల్లించేందుకు సిద్ధపడతున్నట్లు కోదాడకు చెందిన మిల్లు వ్యాపారి ఒకరుకు తెలిపారు.

# చేపా.. చేపా.. పిల్లలొస్తాయా?

పాల్వంచ : మత్స్యకారులకు ఆర్థిక తోడ్పాటు ఇవ్వడానికి గత ప్రభుత్వం ఏటా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసింది. గతేడాది కాంగ్రెస్ సర్కారు కొలువుదీరింది. చేపపిల్లల పంపిణీ పథకం కొనసాగింపుపై ఇంకా స్పష్టత లేదు. వర్షాల సీజన్‌కు ముందే టెండర్లు పిలవాల్సి ఉంటుంది. లేదంటే జలాశయాలు నిండిన తర్వాత అదనుకు పిల్లలను పంపిణీ చేయటం సాధ్యం కాదు.

ఊసేలేని టెండర్లు గతంలో చేపపిల్లల సరఫరాకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఇప్పటికే మొదలయ్యేది. మే నెలలోనే టెండర్లు ముగిసేవి. గుత్తేదారులు సైతం సీజన్ మొదలయ్యే లోపు పిల్లలను సిద్ధం చేసుకునేవారు. ఆగస్టులో చెరువులు నిండిన వెంటనే 100 శాతం ఉచితంగా సకాలంలో చెరువుల్లో వదలడంతో ఎదుగుదల బాగుండేది. కానీ ఈ ఏడాది మే నెలాఖరు కావొస్తున్నా చేపపిల్లల పంపిణీపై మత్స్యశాఖ అధికారులు స్పష్టత ఇవ్వలేకపోవతున్నారు. సంబంధిత మంత్రిత్వ శాఖ నుంచి సైతం ఎలాంటి సమాచారం లేదని చెబుతున్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి వీరన్నను వివరణ కోరగా.. 'చేప పిల్లల టెండర్ల విషయంపై ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. రాష్ట్ర ప్రభుత్వ నోటిఫికేషన్ విడుదలైతే జిల్లాస్థాయిలో ప్రక్రియ మొదలవుతుంది. ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం' అని తెలిపారు.

ఆలస్యమైతే.. అంతే సంగతులు చేప పిల్లలను జల వనరుల్లో ఆలస్యంగా వదిలితే వాటి ఎదుగుదల సక్రమంగా ఉండదు. ఆగస్టు, సెప్టెంబరు రెండో వారంలోపే పెంపకాన్ని మొదలుపెట్టాలి. అప్పుడే మంచి దిగుబడి వస్తుంది. లేదంటే ఏ రకమైనా సరే.. చేప బరువు అంతంత మాత్రమే ఉంటుంది. ఒకవేళ ప్రభుత్వానికి చేపపిల్లలను పంపిణీ చేసే ఉద్దేశం ఉన్నా.. ఆలస్యం కారణంగా గుత్తేదారులు నాసిరకం చేపపిల్లల్ని మత్స్యకారులకు అంటగట్టే ప్రమాదం లేకపోలేదు. తద్వారా అసలు ఉద్దేశం నెరవేరదని మత్స్యకార సంఘాలు చెబుతున్నాయి. ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సకాలంలో టెండర్లు నిర్వహించేలా చూడాలని కోరుతున్నాయి.

# వడ్లు వచ్చింది అంతంతే

ఖమ్మం : యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా రైతుల నుంచి రూ.46.42 కోట్ల ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ కొనుగోలు చేసింది. ఈ వడ్లను ఎంపిక చేసిన రైస్ మిల్లులకు అధికారులు తరలించారు. సీజన్‌కు ముందు 236 కొనుగోలు కేంద్రాలు తెరవనున్నట్లు ప్రకటించారు. సుమారు రెండు నెలల నుంచి (ఈనెల 23 వరకు) 90 కేంద్రాల్లో మాత్రమే ధాన్యం సేకరించారు. మిగతా కేంద్రాల్లో విక్రయానికి గింజ ధాన్యం కూడా రాలేదు. రబీ సీజన్‌లో 1.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించగా కేవలం 90 కేంద్రాల్లో 21,182 మెట్రిక్ టన్నుల వడ్లను మాత్రమే సేకరించారు. సత్తుపల్లి, పెనుబల్లి, వేంసూరు మండలాల్లో మాత్రమే కొంత ధాన్యాన్ని రైతులు కేంద్రాల్లో విక్రయించారు.

తగ్గిన సాగు విస్తీర్ణంతీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో యాసంగిలో వరి సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. చాలా ప్రాంతాల్లో సాగు నీరందక పైర్లు ఎండిపోవటంతో రైతులు నష్టపోయారు. జిల్లాలోని 17 మండలాల్లో ఆయకట్టుకు ఆధారమైన సాగర్ కాల్వల ద్వారా చుక్క నీరు విడుదల కాలేదు. ఎగువన నాగార్జున సాగర్‌లో జల లభ్యత లేనందున ఖరీఫ్, రబీ సీజన్లకు సాగునీటి సరఫరా నిలిచిపోయింది. విద్యుత్తు మోటార్లు, బావులు ఆధారంగా యాసంగిలో వరి సాగు చేసినా దిగుబడి తగ్గిపోయింది. పొరుగున ఏపీ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు, మిల్లర్లు వరి కోతల సమయంలో కల్లాల్లోనే ఎక్కువ ధరకు రైతుల నుంచి వడ్లు కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు మించి వ్యాపారులు ధర చెల్లిస్తామనటంతో రైతులు వారికే ధాన్యం విక్రయించారు. అందుకే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో కొనుగోళ్లు మందగించాయి.

# రిజర్వాయర్ నిర్మించి... కాలువలు విస్మరించి

రుద్రంగి : జలాశయం నిండా నీరున్నా ఆయకట్టుకు అందని పరిస్థితి ఏర్పడింది. ఏళ్ల తరబడి ఈ సమస్య కొనసాగుతున్నా పట్టించుకున్న నాథుడు లేడు. కర్షకుల కల్లెదుటే నీరు వృథాగా పోతున్నా ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. మండల కేంద్రంలో ఎగువన ఉన్న నాగారం చెరువు సామర్థ్యం పెంచడం ద్వారా ఆయకట్టు ప్రాంతం సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో దానిని రిజర్వాయర్‌గా మార్పు చేశారు. ఇది జరిగి దశాబ్దం దాటింది. రిజర్వాయర్ దిగువన ఆయకట్టుకు సాగునీరు అందించే డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో సుమారు 2 వేల ఎకరాలకు పైగా భూములకు సాగునీరు అందడం లేదు. దీంతో జలాశయం ఉన్నా ప్రయోజనం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జలాశయంలో నీరు పూర్తి స్థాయిలో నిల్వ ఉన్నా దిగువ ఆయకట్టుకు నీటిని విడుదల చేసే పరిస్థితి లేదు. దీంతో ఏటా వందల సంఖ్యలో నూతనంగా బావులు, బోరుబావులు తవ్వుతూ అధిక పెట్టుబడులను రైతులు వెచ్చించాల్సి వస్తోంది. కాలువల నిర్మాణానికి భూసేకరణ, నిర్మాణ పనులను పూర్తి చేయడానికి చాలా సమయం పట్టే అవకాశం ఉంది. అప్పటి వరకు రిజర్వాయర్‌కు ఇరువైపులా ఏర్పాటు చేసిన తూముల ద్వారా నీటిని దిగువన ఉన్న మత్తడి నీరు వెళ్లే మార్గం నుంచి అయినా విడుదల చేస్తే సమీపంలోని కనీసం 200 ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం చేకూరేది. కానీ తూములను ఎత్తైన ప్రాంతంలో నిర్మించడంతో రిజర్వాయర్‌లో నీరున్నా ఆయకట్టుకు అందించలేని దుస్థితి నెలకొంది.



కుడి వైపు తూము లీకేజీతో...

రిజర్వాయర్‌కు కుడి, ఎడమ వైపు రెండు తూములను ఏర్పాటు చేశారు. గతేడాది వర్షాకాలంలో కుడి వైపు ఉన్న తూము లీకేజీకి గురికావడంతో రిజర్వాయర్‌లోని నీరు వృథాగా దిగువకు వెళ్లిపోయింది. దీంతో కొద్ది రోజుల్లోనే నీటి మట్టం తగ్గిపోయింది. ఈ తూముకు మరమ్మతులు చేస్తే కనీసం వర్షాకాలంలో అయినా నీరు వృథా కాకుండా ఉంటుంది.

మోటార్ల ఏర్పాటుతో...

మండల కేంద్రంలోని రైతులు వానాకాలం, యాసంగి సీజన్‌ల్లో ఎక్కువగా వరి పండిస్తారు. ఆ తర్వాత మొక్కజొన్న, పసుపు, కూరగాయల సాగుకు ప్రాధాన్యం ఇస్తారు. వరి పండించే రైతులు అధికంగా బావులు, బోరుబావులపై ఆధారపడి సాగు చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల్లో రిజర్వాయర్‌లోని నీరు పంటలకు అందించే డిస్ట్రిబ్యూటరీ కాలువలు లేకపోవడంతో రైతులే సొంతంగా వేలాది రూపాయలు ఖర్చు చేస్తూ 500 మీటర్ల దూరం నుంచి 1.5 కి.మీ.ల దూరం వరకు పైప్‌లైన్ వేసుకుని మోటార్ల ద్వారా నీటిని పంటలకు మళ్లించుకుంటున్నారు.

దశాబ్దం అయినా...

నాగారం రిజర్వాయర్ దిగువన డిస్ట్రిబ్యూటరీ కాలువలు నిర్మిస్తే ఆయకట్టు రైతులకు మేలు జరుగుతుంది. ఇప్పటికే రిజర్వాయర్ నిర్మించి దశాబ్దం అవుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే కాలువ నిర్మాణానికి చర్యలు చేపట్టాలి.
ఉప్పులూటి గణేశ్, రైతు, రుద్రంగి

త్వరలో నిర్మాణానికి చర్యలు

ఎల్లంపల్లి ప్యాకేజీ-2లో భాగంగా నాగారం రిజర్వాయర్ కింద ఉన్న ఆయకట్టుకు సాగునీటి కాలువల ఏర్పాటు పనులను అతి త్వరలో చేపడతాం. అలాగే కుడివైపు తూము నుంచి లీకేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానిక అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. సంతుప్రకాశ్, ఈఈ, ఎల్లంపల్లి ప్రాజెక్ట్

# సైబర్ కేటుగాళ్లు

జగిత్యాల : సాంకేతికత పెరుగుతున్న కొద్దీ మోసాలు కూడా అదే స్థాయిలో పెరిగిపోతున్నాయి. సాంకేతికతతో ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో నష్టాలు కూడా అంతే ఉన్నాయి. అత్యాశకు పోయి చాలా మంది ఖాతాలోని డబ్బులు పోగొట్టుకొంటున్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడి మోసానికి గురవుతున్నారు. ఇటీవల జిల్లాలో నమోదైన సైబర్ కేసులపై కథనం..

జిల్లాలో ఈ మధ్య కాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. జిల్లాలోని కోరుట్లకు చెందిన శంకరయ్యను బెదిరించి రూ.4.23 కోట్లు కాజేశారు. ఇందులో పోలీసులు కొందరిని గుర్తించి పట్టుకుని జైలుకు పంపారు. ఇంకా కొంత మందిని అరెస్టు చేయాల్సి ఉంది. జిల్లా ఈ ఏడాది భారీగా కేసులు నమోదయ్యాయి. జిల్లాలో మొత్తం 546 సైబర్ కేసులు నమోదు అయ్యాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇందులో యూపీఐ ద్వారా నగదు దోచుకున్నవి 288 కేసులు నమోదు కాగా డెబిట్, క్రెడిట్ కార్డు పేరుతో దోచుకున్నవి 66, ఇంటర్ నెట్ బ్యాంకింగ్ పేరుతో మోసపోయినవి 62 కేసులు ఉండగా, ఫోన్ కాల్ ఆధారంగా మోస పోయినవి 36, బ్యాంకు డిపాజిట్లు తదితర 12, ఈ వ్యాలెట్ పేరతో 10, ఇతర 12 కేసులు నమోదైనట్లు పోలీసు గణంకాల ద్వారా తెలుస్తోంది.

గతంలో బ్యాంకులో దాచుకున్న సొమ్ము భద్రంగా ఉండేది. ఇంటర్ నెట్ బ్యాంకింగ్, యూపీఐ వచ్చిన తర్వాత బ్యాంకు అధికారులకు సంబంధం లేకుండానే క్షణాల్లో ఇతరులకు డబ్బులు పంపించే వెసులుబాటు లభించింది. ఇదే సాంకేతికతను అడ్డం పెట్టుకుని అనేక విధానాల్లో సైబర్ నేరగాళ్లు సొమ్మును దోచుకుంటున్నారు. తక్షణం పోలీసులకు సమాచారం ఇచ్చిన కేసుల్లో మాత్రమే సొమ్ము తిరిగి ఇప్పిస్తున్నారు. ఆలస్యమైతే నేరగాళ్లు ఖాతానే మూసి వేసి ఆధారాలు లేకుండా చేస్తున్నారు.

సైబర్ నేరాలకు: 1930కు సమాచారం ఇవ్వాలి

జిల్లాలో ఈ ఏడాది నమోదైన సైబర్ కేసులు: 546

ఓటీపీ వివరాలు చెప్పవద్దు..

బ్యాంకు ఖాతాల వివరాలను ఎవరికి చెప్పకూడదు. ఒక వేళ మోసపోయామని గుర్తిస్తే వెంటనే 1930కు ఫోన్ చేసి చెప్పాలి. సైబర్ మోసాలపై జిల్లాలో ఇప్పటికే అవగాహన కల్పించాం. చాలా మంది అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి సొమ్ము పోగొట్టుకుంటున్నారు. ఇతరులకు బ్యాంకు ఓటీపీ వివరాలు చెప్పవద్దు. రఘు చందర్, డీఎస్పీ, జగిత్యాల

# మరమ్మతులు చేపడితే.. పడావులే మాగాణులు



వికారాబాద్: ప్రభుత్వం జిల్లాలోని అన్నదాతలకు సాగునీరు అందించే లక్ష్యంతో జలాశయాలను నిర్మిస్తోంది. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చోట మరమ్మతులు చేపడితే నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ దశాబ్దాలుగా మరమ్మతులు చేపట్టక పోవడంతో కనీసం సగం ఆయకట్టుకు కూడా నీరందించలేని స్థితిలో కొనసాగుతున్నాయి. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తోంది.. జుంటిపల్లి జలాశయం. తాజాగా అధికారుల సందర్శనతో అభివృద్ధి పనులు జరిగి పూర్వవైభవం ఏర్పడుతుందని రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

30 ఏళ్ల పాటు సాగు బాగు

ఈ ప్రాజెక్టు దాదాపు 30 ఏళ్ల పాటు సాగు నీరు అందించింది. తద్వారా రైతులు జొన్న, వరి, వేరుసెనగ తదితర పంటలు సాగు చేసి అధిక దిగుబడి సాధించారు. మొదట్లో 2080 ఎకరాల మేర సాగు నీరు అందించగా పర్యవేక్షణ లోపంతో ప్రస్తుతం 1200 ఎకరాలకు మించి నీరు అందించలేని దశకు చేరింది.

సకాలంలో మరమ్మతులు చేపట్టక పోవడంతో కుడి, ఎడమ కాలువలు 5 కిలో మీటర్ల మేర దెబ్బతిన్నాయి.

దాదాపు 10 కి.మీ. దూరాన ఉన్న కుడి, ఎడమ కాలువల్లో ముళ్ల తుమ్మ, గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. వీటి ద్వారా అర కిలో మీటరు మేర మాత్రమే సాగు నీరు పారుతోంది. అక్కంపల్లి గ్రామంలోని రైతులకు సాగునీరు అందక ప్రతిసారి వరి పంటలు ఎండిపోయి నష్టపోతున్నారు.

ఎడమ కాలువ దాదాపుగా మట్టితో కూరుకు పోయింది. అగ్గనూర్, ఎన్కేపల్లి, మల్‌రెడ్డిపల్లి గ్రామాల రైతులకు చుక్క నీరు అందడంలేదు. పిల్ల కాలువలు పూర్తిగా భూమిలో కలిసిపోయాయి.

ఉన్న కొద్దిపాటి నీరూ ఖాళీ చేశారు జుంటిపల్లి జలాశయం కుడి, ఎడుమ తూముల ఛానల్స్, రాడ్‌లు, గేర్‌బాక్స్‌లు పూర్తిగా పాడవడంతో మూడు నెలల క్రితం క్రితం వాటి మరమ్మతులకు రూ.8.50లక్షలు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించాలని అధికారులు జలాశయంలో నాలుగు అడుగుల మేర ఉన్న నీటిని వృథాగా బయటికి వదిలారు. దీంతో వరి సాగు రైతులకు నీరు అందకుండా పోయింది.

మోడల్ ప్రాజెక్టుగా మారుస్తారా..

జుంటిపల్లి ప్రాజెక్టు తూములతో పాటు కుడి, ఎడమ కాలువలను నీటి పారుదల శాఖ రిటైర్డ్ ఈఈ మహబూబ్ హుస్సేన్, తాండూరు డీఈఈ కిష్టయ్యతో కలిసి ఇటీవల పరిశీలించారు. వచ్చే ఖరీఫ్ కాలంలో రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీరు అందించాలన్నారు. జుంటిపల్లిని త్వరలోనే ఒక మోడల్ ప్రాజెక్టుగా తయారు చేస్తామన్నారు. ఇది నిజంగా కార్యాచరణలోకి వస్తే తమకు పండగేనని రైతులు ఆశిస్తున్నారు. భూములు బీడుగా పెట్టుకున్నాం: కోయిల కొండ భీములు, ఆయకట్టు రైతు జుంటిపల్లి

దాదాపు 20 సంవత్సరాలుగా జలాశయం కింద 20 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాం. ప్రస్తుతం ప్రాజెక్టు తూములు, కాలువలు పాడై చుక్క నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సరైన సమయంలో సాగు నీరు అందక భూములను బీడుగా పెట్టుకున్నాం.

రూ.8కోట్లతో ప్రతిపాదనలు పంపాం: కిష్టయ్య నీటి పారుదల శాఖ డీఈఈ, తాండూరు

జలాశయం రెండు తూములు, రెండు కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మరమ్మతులకు రూ.8కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పూర్తి స్థాయిలో చేపడతాం.

# నిర్మాణాలు వేగవంతం.. సమస్యలు దూరం



తాండూరు : తాండూరు పట్టణం నుంచి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న సెంట్‌మార్ఫ్స్ ఇంటర్నేషనల్ పాఠశాల వరకు రోడ్డు విస్తరణతో పాటు కాలువ నిర్మాణాన్ని రహదారులు భవనాల శాఖ చేపడుతోంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25 కోట్లను మంజూరు చేసింది. ఇటీవలే పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం కాలువ నిర్మాణం ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం నుంచి కొనసాగితే రహదారి విస్తరణ పనులు పాఠశాల వైపు నుంచి కొనసాగుతున్నాయి. దీంతో ట్రాఫిక్, ఇతర సమస్యల నుంచి పరిష్కారం లభిస్తుందని స్థానికులు ఆశిస్తున్నారు.

గతంలో రూ.22కోట్లతో పనులు: గతేడాది తాండూరు, కొడంగల్ పట్టణాల్లో 9 కి.మీటర్ల పొడవునా నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులను రూ.22 కోట్లతో నేషనల్ హైవే అథారిటీ చేపట్టింది. ఇందులో తాండూరులో ఒక వైపు నుంచి 6 కిలో మీటర్ల రోడ్డు, 5 కిలో మీటర్ల పొడవునా వరద కాలువ నిర్మాణం చేపట్టింది.. తాజాగా నేషనల్ హైవే అథారిటీ జాతీయ రహదారి నిర్మాణాన్ని తాండూరు పట్టణం మీదుగా కాకుండా తాండూరు మండలం అల్లాపూరు నుంచి కాగ్నానది వద్ద కొత్తగా నిర్మించే వంతెన వరకు చేపడుతోంది. దీన్ని బైపాస్ రోడ్డుగా పరిగణించింది. అయితే ఇది వరకు తాండూరు పట్టణంలో నిర్మించిన రహదారిని రహదారులు, భవనాల శాఖ పరిధిలోకి మార్చారు. దీంతో రోడ్డుకు ఒక వైపున పెండింగులో ఉన్న కాలువల నిర్మాణం, రహదారి విస్తరణ పనులను రహదారులు, భవనాల శాఖ చేపడుతోంది. దీంతో వర్షాకాలంలో నీరు నిలిచి ఇబ్బందులు పడే అవస్థలు తొలగుతాయని స్థానికులు ఆశిస్తున్నారు.

14.5 అడుగుల వెడల్పుతో విస్తరణ: తాండూరులో ఇది వరకు నిర్మాణమైన రోడ్డుకు ఒక వైపు నుంచి 14.5 అడుగుల వెడల్పు చొప్పున రహదారి నిర్మాణం జరగాల్సి ఉంది. ప్రస్తుతం విస్తరించాల్సిన రహదారి మట్టిదిబ్బలతోనే ఉంది. మధ్యలో విద్యుత్తు స్తంభాలు, నియంత్రికలు ఉన్నాయి. వీటిని తొలగించి తారు రహదారి నిర్మించాలి. ఇది జరిగితేనే పట్టణంలోని రోడ్డు నాలుగు వరుసలుగా మారుతుంది. వాహనాల రాకపోకలు సౌకర్యంగా సాగుతాయి.

వీలున్న చోట పనులు జరుగుతున్నాయి

తాండూరు పట్టణంలో ప్రస్తుతం అనుకూలంగా ఉన్న ప్రదేశాల్లోనే పనులు చేపడుతున్నాం. విద్యుత్తు స్తంభాలు, నియంత్రికలు, ఇతర కట్టడాలు లేని చోట కాలువల నిర్మాణం జరుగుతోంది. రహదారి విస్తరణకు కంకర పరిచే పనులు ప్రారంభమయ్యాయి. వర్షాలు కురిస్తే తారును వేయడం కుదరదు. కాలువ పనులు మాత్రం యథాతథంగా కొనసాగిస్తాం.శ్రీనివాస్, డీఈఈ, రహదారులు, భవనాల శాఖ, తాండూరు.

# రూ. 700 కోట్లతో రింగ్ రోడ్డు నిర్మాణం



నల్గొండ : నల్గొండ జిల్లా ప్రజలు, వ్యాపారుల చిరకాల స్వప్నం సాకారం కానుందా.. అంటే ప్రభుత్వ నిర్ణయంతో అవుననే చెప్పాలి. నీలగిరి మీదుగా వెళ్లే 565, నార్కట్‌పల్లి- అద్దంకి జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ నల్గొండ చుట్టూ బాహ్యవలయ రహదారి నిర్మాణానికి తొలి అడుగులు పడ్డాయి. నకిరేకల్- మాచర్ల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా.. నీలగిరిలో గత పదేళ్లుగా నల్గొండ పట్టణంలో జాతీయ రహదారి విస్తరణ పనులు నిలిచిపోయిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వానికి వ్యాపారులు మొర పెట్టుకున్నా ఆలకించే వారు కరవయ్యారు. ఇటీవల రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రిగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరిని కలిసి రూ.1000 కోట్ల ప్రతిపాదనలతో రింగు రోడ్డు నిర్మించాలని కోరిన విషయం తెలిసిందే. మంత్రి అభ్యర్థన మేరకు గత ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం ప్రాథమికంగా సుమారు రూ.700 కోట్లతో రోడ్డు నిర్మాణానికి పచ్చజెండా ఊపినట్లు పలు మార్లు మంత్రి కోమటిరెడ్డి ప్రకటించారు. తాజాగా చేపట్టిన సర్వే పనులతో రింగు రోడ్డు నిర్మాణ పనులకు కదలికొచ్చింది.

నీలగిరి చుట్టూ శరవేగంగా సర్వే

జాతీయ రహదారుల సంస్థ ఆదేశాల మేరకు కన్సల్టెన్సీ సంస్థలు నల్గొండ చుట్టూ నాలుగు లైన్ల రోడ్డు నిర్మించేందుకు అవసరమైన స్థల సేకరణ, అనుకూలత, ప్రజా రవాణా సౌకర్యం, నిధుల వ్యయం వంటి అంచనాతో సర్వే ప్రారంభించారు. పట్టణ సమీపంలోని చర్లపల్లి, మర్రిగూడ చెరువు వెనుక భాగం, బైపాస్‌రోడ్డులో గోదాం వెనక భాగం నుంచి నందీహిల్స్ మీదుగా హౌసింగ్‌బోర్డుకాలనీ, గుండ్లపల్లి రోడ్డు (సంతోష్‌నగర్), దేవరకొండ రోడ్డు (వీరాంజనేయగార్డెన్) సమీపం మీదుగా ఎస్ఎల్‌బీస్మీ వరకు సర్వే పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. నల్గొండ ఉత్తర, తూర్పు భాగంలో పానగల్, కేశరాజుపల్లి, నర్సప్పగూడెం, గంధవారిగూడెం సమీపం నుంచి మాచర్ల రహదారికి అనుసంధానించే మార్గంలో సైతం సర్వే పనులు చేపట్టినట్లు తెలిసింది. ప్రధానంగా రింగురోడ్డు వచ్చే మార్గంలో జీపీఎస్ పద్ధతి ప్రకారం తాత్కాలిక బెంచ్ మార్కు (టీబీఎం)రాళ్లను నాటుతున్నారు. అదే విధంగా రైల్వే లైన్లు, ఏఎమ్మార్పీ కాల్వలు, పైవంతెనలు, వంతెనలు నిర్మించే 13 ప్రాంతాల్లో డ్రిల్లింగ్ ద్వారా మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు తర్వాత బాహ్యవలయ రహదారి నిర్మాణ పనుల టెండర్ల ప్రక్రియ ఇతర పనులు పట్టాలెక్కే అవకాశం ఉన్నట్లు సంబంధిత శాఖ అధికారులు భావిస్తున్నారు.

భూ యజమానుల ఆందోళన

రింగ్ రోడ్డు నిర్మాణ ప్రాంతాల్లో చేపట్టిన సర్వేతో భూ యజమానులు తమ ప్లాట్లను పరిశీలించుకుంటున్నారు. వీరికి తోడు రైతులు సైతం తమ చెల్కలు, పొలాల నుంచి రోడ్డు నిర్మాణాలకు తాత్కాలిక మార్కు చేయడంతో కతాలగూడ వద్ద వంతెన నిర్మాణ ప్రాంతంలో మట్టినమూనాల కోసం డ్రిల్లింగ్ చేస్తున్న యంత్రాలను అడ్డుకుని ఆందోళన చేపట్టారు.

# మెరుగైన భద్రతా చర్యలు ముఖ్యం

గోదావరిఖని : దిల్లీలోని బేబీకేర్ ఆసుపత్రిలో జరిగిన అగ్నిప్రమాదంలో రెండు భవనాలు ధ్వంసం కావడంతో పాటు పలువురు చిన్నారులు మృతిచెందారు. మరికొందరు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఆసుపత్రుల్లో ఆక్సిజన్ సిలిండర్లు భద్రపరచడం, అగ్నిప్రమాద నియంత్రణ చర్యలు తీసుకోవడంపై అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మధ్యకాలంలో నిర్మించిన ప్రైవేటు ఆసుపత్రుల్లో మినహా గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న ఆసుపత్రుల్లో అగ్నిప్రమాద నివారణకు ఏర్పాట్లు నామమాత్రమే. ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా 15 అడుగులకంటే ఎత్తులో ఉండే భవనాలకు అగ్నిమాపక కేంద్రం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంది. గ్రౌండ్ ఫ్లోర్‌తో కలిపి 15 అడుగుల లోపు ఎత్తు కలిగిన భవనాలకు అగ్నిమాపక కేంద్రం అనుమతి అవసరం లేకపోయినా నివారణకు తగు ఏర్పాట్లు చేసుకోవాల్సిన అవసరం ఉంది. దిల్లీలోని ఆసుపత్రిలో అగ్నిప్రమాదం జరిగిన నేపథ్యంలో జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన మొదలుపెట్టారు. చాలాచోట్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అగ్నిప్రమాద నియంత్రణకు చర్యలు లేకపోవడం గమనార్హం. గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో పాత భవనంలోని కొన్ని వార్డుల్లో మాత్రమే ప్రమాద నియంత్రణ చర్యలు ఉండగా కొన్నిచోట్ల లేవు. సార్వజనిక ఆసుపత్రిగా స్థాయి పెరగగానే ఆసుపత్రిలో అగ్నిమాపక నివారణ చర్యలు తీసుకున్నారు. ఆ తర్వాత ఆధునికీకరించిన విభాగాల్లో మాత్రం ఆయా చర్యలు కనిపించడం లేదు. ప్రధానంగా పిల్లల ఐ.సి.యు.లోనే అగ్నిప్రమాద నివారణకు ఏర్పాట్లు లేవు. గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఇటీవల



నిర్మించిన 85 పడకల సామర్థ్యం గల భవనంలో అగ్నిప్రమాద నివారణ చర్యలు చేపట్టలేదు. ప్రమాదం జరిగినప్పుడు ఏవైపునుంచి బయటకు వెళ్లాలనే కనీస సూచికలు సైతం ఏర్పాటు చేయలేదు.

సిలిండర్ల నిల్వలపై నిర్లక్ష్యం

జిల్లాలోని ఆసుపత్రుల్లో ఆక్సిజన్ సిలిండర్లను భద్రపరుస్తున్న తీరు ఆందోళనలకు తావిస్తోంది. చాలా వరకు ప్రైవేటు ఆసుపత్రుల్లో వార్డులు, ఆపరేషన్ థియేటర్లలోనే ఓ పక్కన సిలిండర్లను ఉంచుతున్నారు. ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో సిలిండర్లను భద్రపరచడంలో ప్రమాణాలను పాటించడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ ఆక్సిజన్ ప్లాంటు ఏర్పాటు చేయకముందు పాత భవనంలో మెట్ల కింద వార్డులకు అతి సమీపంలో ఆక్సిజన్ సిలిండర్లను ఉంచి అక్కడి నుంచి పైపులైను ద్వారా వార్డులకు ఆక్సిజన్ సరఫరా చేస్తుండేవారు. ప్లాంటు ఏర్పాటు తర్వాత నేరుగా ప్లాంటు నుంచి వార్డులకు పైపులైను ద్వారా సరఫరా చేస్తున్నారు. 85 పడకల సామర్థ్యంతో నిర్మించిన నూతన భవనం ఆక్సిజన్ ప్లాంటుకు దూరంగా ఉండడంతో పైపులైను ద్వారా సరఫరా చేసే పరిస్థితులు లేవు. సిలిండర్ల ద్వారా ఐ.సి.యు.తో పాటు వివిధ వార్డులకు ఆక్సిజన్ సరఫరా చేసేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకు అవసరమైన సిలిండర్లను రక్తశుద్ధి కేంద్రం పక్కనే భద్రపరిచి అక్కడి నుంచి పైపులైను ద్వారా వార్డులకు సరఫరా చేస్తున్నారు. దురదృష్టవశాత్తూ ఏదైనా ఘటన జరిగితే పరిస్థితి ఏమిటన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. నూతన భవనంలోకి ఆక్సిజన్ సరఫరా చేసేలా పైపులైను ఏర్పాటు చేయాలని గతంలో ప్రతిపాదించారు. దీని కోసం ప్రత్యేక నిధులు విడుదల చేస్తే తప్ప నిర్మాణం జరిగే అవకాశం లేదు. దీనికంటే ప్రత్యేకంగా లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంటు ఏర్పాటు ఉత్తమమని సంబంధిత ఉన్నతాధికారులు సూచించడంతో దానినే ఏర్పాటు చేయాలంటూ ఆసుపత్రి వర్గాలు ఉన్నతాధికారులకు నివేదించాయి.

లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంటు కోసం నివేదించాం


కొవిడ్ సమయంలో గోదావరిఖనిలో ఏర్పాటు చేసిన పి.ఎస్.సి. ఆక్సిజన్ ప్లాంటు కంటే అవసరమైన ఒత్తిడితో పాటు తక్కువ వ్యయంతో ఉత్పత్తి జరిగేలా లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంటు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి నివేదించాం. పి.ఎస్.సి. ప్లాంటు నిర్వహణ వ్యయం ఎక్కువ కావడం, ఆక్సిజన్ ప్లాంటు నుంచి పైపులైను నిర్మాణానికి నిధులు ఎక్కువ అవసరం కానున్న నేపథ్యంలో లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంటు ఏర్పాటు ఉత్తమమని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. ఈ మేరకు చర్యలు తీసుకుంటాం. డాక్టర్ హిమబిందుసింగ్, ప్రిన్సిపల్, ప్రభుత్వ వైద్య కళాశాల, గోదావరిఖని

## స్వశక్తి సంఘాలకు రుణ లక్ష్యం ఖరారు

జగిత్యాల : రాష్ట్రప్రభుత్వం టీసెర్ప్ మహిళా స్వశక్తి సంఘాలకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకులింకేజీ రుణలక్ష్యాన్ని ఇటీవలే నిర్దేశించింది. జిల్లాలోని 18 మండలాల్లో 12,632 సంఘాలకు రూ.765.66 కోట్ల లింకేజీ రుణాన్ని మంజూరిచ్చేలా



ప్రణాళికను రూపొందించారు. గడచిన ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో నిర్దేశిత లక్ష్యాన్నిదాటి రుణాలను పంపిణీ చేయగా రికవరీలోనూ ప్రగతిని సాధించారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ నిర్దేశిత రుణలక్ష్యాన్ని పూర్తిచేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇదివరకు ప్రభుత్వం ద్వారా రుణాలను తీసుకున్న వారందరూ తమ ఆదాయాన్ని అభివృద్ధి చేసుకునేలా నూనెలు, పొడుల తయారీ, కిరాణాలు, పప్పుల మిల్లులు, ఇతరత్రా ఉపఉత్పత్తుల తయారీకిగాను భిన్నమైన యూనిట్లను నెలకొల్పుకున్నారు. మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తున్నట్లు టీసెర్ప్ జగిత్యాల ఏపీఎం వోదెల గంగాధర్ పేర్కొన్నారు. మరోవైపు మహిళా సంఘాలు చెల్లించిన వడ్డీని ప్రభుత్వం తిరిగి సంఘాల ఖాతాలో జమచేయాల్సి ఉండగా దాదాపుగా మూడేళ్లవడ్డీ పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో వడ్డీ చెల్లిస్తామని, వడ్డీలేని రుణ పథకాన్ని చేపడతామన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన అమలుతో సంఘాలకు మరింతగా ప్రోత్సాహకరంగా మారనుంది.



# అంతరిక్షంలోకి భారత్ అగ్నిబాణ్

ప్రపంచ అంతరిక్ష మార్కెట్లను ఒడిసిపట్టేలా భారత్ మరో కీలక ముందడుగు వేసింది. ప్రత్యేకశ్రేణి ఉపగ్రహాలను వీలైనంత వేగంగా.. కారు చౌకగా కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు వీలుగా ప్రయోగం చేపట్టింది. చెన్నై ఐఐటీ కేంద్రంగా పనిచేసే అగ్నికుల్ సంస్థ 'అగ్నిబాణ్' పేరిట తొలిసారి సబ్-ఆర్బిటాల్ టెక్నాలజీ డెమానిస్ట్రేటర్ ప్రయోగాన్ని నిర్వహించింది. గురువారం ఉదయం 7.15 గంటల సమయంలో దీనిని ప్రయోగించినట్లు ఇస్రో ప్రకటించింది. ఇందులో తొలిసారి సెమీ క్రయోజనిక్ ఇంజిన్ లిక్విడ్ ఇంజిన్ కంట్రోల్డ్ ఫ్లైట్ నిర్వహించినట్లైంది. ఇస్రో ఛైర్మన్ సోమ్‌నాథ్ కూడా అగ్నికుల్ కాస్మోస్ సంస్థను అభినందించారు. వాస్తవానికి ఈ ప్రయోగం దాదాపు నెలన్నర క్రితమే జరగాల్సింది. కానీ, నాలుగుసార్లు వాయిదా పడింది. ఐదోసారి విజయవంతంగా పూర్తి చేసుకొంది.

**ఏమిటీ పరీక్ష..** ఈ ప్రయోగం దాదాపు రెండు నిమిషాలపాటు సింగిల్ స్టేజ్‌లోనే జరిగింది. దీనిలో ప్రపంచంలోనే తొలిసారి తయారుచేసిన సింగిల్‌పీస్ త్రీడీ ప్రింటెడ్ సెమీ క్రయోజనిక్ ఇంజిన్‌ను అమర్చారు. దీనిపై అగ్నికుల్ కాస్మోస్‌కు పేటెంట్ ఉంది. ఇది సబ్‌కూల్డ్ ద్రవ ఆక్సిజన్ ఆధారంగా ఒక స్టేజిలోనే పనిచేసింది. ఈ వ్యవస్థను పూర్తిగా దేశీయంగానే అభివృద్ధి చేశారు. దీర్ఘ వృత్తాకార ముక్కుతో ఉన్న ఈ రాకెట్ పొడవు 6.2 మీటర్లు. దీని లోపలే ఉపగ్రహాన్ని అమర్చారు. ఈ రాకెట్‌లో తొలిసారి ఈథర్‌నెట్ ఆధారంగా పనిచేసే ఏవియానిక్స్ వ్యవస్థను వాడారు. పూర్తిగా దేశీయంగా అభివృద్ధి చేసిన ఆటోపైలెట్ కంట్రోల్ సిస్టమ్‌ను ఇందులో వినియోగించారు. ఒకవేళ ప్రయోగం అదుపుతప్పితే తక్షణమే దానిని నాశనం చేసేలా ఇస్రో అభివృద్ధి చేసిన ఫ్లైట్ టర్మినేషన్ వ్యవస్థను కూడా దీనిలో అమర్చారు. పలురకాల లాంచర్ల నుంచి ప్రయోగించేలా దీనిని నిర్మించారు. 300 కిలోలలోపు బరువున్న ఉపగ్రహ ప్రయోగాలకు వెంటనే అవకాశాలు దొరకవు. ఇలాంటి వాటి కోసం అగ్నికుల్ నిర్మించిన రాకెట్ సరిపోతుందని భావిస్తున్నారు.

**తొలి ప్రైవేటు లాంచ్ ప్యాడ్‌పై ప్రయోగం రెండు నిమిషాలే..** ఈ మొత్తం ప్రయోగం దాదాపు రెండు నిమిషాలు మాత్రమే జరిగింది. ముగిశాక రాకెట్ సముద్రంలో కూలిపోయింది. శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ స్పేస్‌సెంటర్‌లో ఏర్పాటుచేసిన తొలి ప్రైవేటు లాంచ్ ప్యాడ్ ఏఎల్‌పీ-01 ఈ పరీక్షకు వేదికైంది. ఈ రాకెట్ ప్రయోగించిన తర్వాత నాలుగు సెకన్ల సమయంలో నిర్ణీత దిశకు మళ్లింది. 1.29 నిమిషాల సమయానికి ఇది నిర్దేశిత ప్రదేశానికి చేరి.. అక్కడినుంచి తిరిగి సముద్రంలో పడింది.

అగ్నికుల్ ఇంజిన్, ఆకారం వాటిని విశ్లేషించి మరింత మెరుగుపర్చడానికి ఈ రెండు నిమిషాల పరీక్ష ఉపయోగపడనుంది. ఈ ప్రయోగం విజయవంతం కావడంపై కేంద్ర మంత్రి రాజీవ్‌చంద్రశేఖర్ అగ్నికుల్ సంస్థను అభినందించారు. ప్రపంచంలోనే తొలిసారి 3డీ ప్రింటెడ్ రాకెట్ ఇంజిన్‌ను కావడం విశేషమన్నారు.




# ఖరారైన తెలంగాణ కొత్త లోగో

హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త లోగోను దాదాపు ఖరారు చేసింది. కాకతీయ తోరణం, చార్మినార్ స్థానంలో అమరవీరుల స్థూపానికి రేవంత్ రెడ్డి సర్కార్ అవకాశం కల్పించింది. చట్టానికి, న్యాయానికి, ధర్మానికి ప్రతీకలైన మూడు సింహాల లోగోను పైభాగంలో పొందుపరిచారు. ఈ లోగోను రేవంత్ రెడ్డి ప్రభుత్వం దాదాపు ఖరారు చేయనున్నట్లు అధికార వర్గాల సమాచారం.

మొత్తం 40కిపైగా డిజైన్లను కాంగ్రెస్ సర్కార్ పరిశీలించింది. మరో రెండు రోజుల్లో అవతరణ ఉత్సవాల నేపథ్యంలో ఆ రోజు కొత్త లోగోను ఖరారు చేయనున్నట్లు సమాచారం.




# చార్మినార్ గురించి నీకేం తెలుసు రేవంత్..?

## చార్మినార్ ముందు బీఆర్ఎస్ ధర్నా.. హైదరాబాద్‌లో హైటెన్షన్

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అధికారిక లోగో నుంచి చార్మినార్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ నిరసన వ్యక్తం చేస్తూ.. చార్మినార్ ముందు ధర్నా చేపట్టారు. కేటీఆర్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు చార్మినార్ వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని, ఉద్దేశపూర్వకంగానే రాజముద్ర మార్పు చేస్తోందని విమర్శించారు. తెలంగాణ చారిత్రక చిహ్నాలను తొలగిస్తోందని, లోగోలో చార్మినార్‌ను తొలగించడమంటే హైదరాబాద్‌ను అవమానించడమేనని అన్నారు. కాకతీయుల కళా తోరణాన్ని ఎలా తొలగిస్తారని కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.



# మోదీకి ఖర్గే సలహా ఇదే..

## ధ్యానం చేస్తే జ్ఞానం రాదు.. ప్రధాని మోదీపై ఖర్గే ఫైర్..

లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి చివరి రోజున కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ప్రధాని మోదీపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గాంధీజీపై ప్రధాని చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఏడోవిడత ఎన్నికల ప్రచారం గురువారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో మీడియాతో ఖర్గే మాట్లాడారు. మహాత్మాగాంధీ గురించి సినిమా చూసిన తర్వాత చాలామంది తెలుసుకున్నారని మోదీ చేసిన వ్యాఖ్యలపై ఖర్గే స్పందిస్తూ.. ప్రధాన మంత్రి చదువుకుని ఉంటే ఇలాంటి మాటలు చెప్పువారుకాదన్నారు. ఆయన ప్రకటన ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. గాంధీ గురించి ప్రధానికి తెలియకపోతే రాజ్యాంగం గురించి కూడా తెలియదని అన్నారు. జూన్ 4 తర్వాత మోదీకి ఖాళీ సమయం దొరికితే గాంధీ ఆత్మకథ, సత్యంతో నా అనుభవాలు పుస్తకాలను తప్పక చదవాలన్నారు.

**మోదీపై ఫైర్..** ప్రధాని మోదీ రాజకీయాలు ద్వేషంతో నిండిపోయాయని ఖర్గే విమర్శించారు. 18వ లోక్‌సభ ఎన్నికల ప్రచారం గురువారం సాయంత్రంతో ముగుస్తుందని.. ఈ ఎన్నికలు చిరకాలం గుర్తుండిపోతాయని ఖర్గే పేర్కొన్నారు. దేశంలోని ప్రతి పౌరుడు కుల, మతాలకు అతీతంగా ఏకతాటిపైకి వచ్చి ఓట్లు వేశారన్నారు. మోదీ మాయమాటలను దేశ ప్రజలు నమ్మలేదన్నారు. జూన్4 తర్వాత కేంద్రంలో ఇండియా కూటమి ప్రభుత్వం రాబోతుందని ఖర్గే తెలిపారు.

**ధ్యానం చేస్తే జ్ఞానం రాదు..** కన్యాకుమారిలో ప్రధాని మోదీ ధ్యానం చేయడానికి వెళ్లడంపై ఖర్గే ఘాటుగా స్పందించారు. వివేకానంద కేంద్రంలో ధ్యానం చేయడం వల్లనో, గంగలో స్నానం చేయడం వల్లనో విజ్ఞానం లభించదని,చదువుకోవడం ద్వారా జ్ఞానం లభిస్తుందన్నారు. గత 15 రోజుల్లో కాంగ్రెస్ పేరును 232 సార్లు, తన పేరును 758 సార్లు, ఇండియా కూటమి, ప్రతిపక్ష పార్టీల గురించి 573 సార్లు మాట్లాడిన మోదీ ఒక్కసారి కూడా ద్రవ్యోల్బణం పేరు ఎత్తలేదన్నారు.

**నియంతృత్వం దిశగా..** కాంగ్రెస్ మేనిఫెస్టోను మతంతో ముడిపెట్టి బీజేపీ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఉల్లంఘించిందని ఖర్గే పేర్కొన్నారు. ఎన్నికలకు ముందే కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను స్తంభింపచేశారన్నారు. మోదీ ప్రభుత్వం నియంతృత్వం వైపు వెళుతోందని, ఈ ప్రభుత్వం రాజ్యాంగంపై దాడి చేస్తుందని ఖర్గే విమర్శించారు.

# ప్రజారోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది నిదర్శనం: హరీశ్‌రావు



హైదరాబాద్: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం 3 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం బాధాకరమని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్(ట్విటర్) వేదికగా తెలిపారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, తెలంగాణ డయాగ్నోస్టిక్స్ తదితర 78 విభాగాల్లో పనిచేస్తున్న 17,541 మంది జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వీరిలో వైద్యులు, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, నర్సులు, అకౌంటెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సెక్యూరిటీ గార్డులు, స్వీపర్లు తదితరులు ఉన్నారని చెప్పారు. వైద్య సిబ్బందికి నెలలుగా జీతాలు చెల్లించకపోవడం ప్రజారోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని ఎద్దేవా చేశారు. ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని గొప్పలు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు ఒట్టి డొల్ల అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి 3 నెలల పెండింగ్ జీతంతో పాటు, పీఆర్సీ బకాయిలను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# ఫోన్ ట్యాపింగ్‌పై కేంద్రానికి ఫిర్యాదు చేయనున్న బీజేపీ



న్యూఢిల్లీ: తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కేంద్ర హోంమంత్రికి రాష్ట్ర బీజేపీ నేతలు ఫిర్యాదు చేయనున్నారు. తెలంగాణలో బయటపడుతున్న గత ప్రభుత్వ కుంభకోణాలపై సీబీఐతో దర్యాప్తు జరపాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ కుంభకోణాలను అడ్డు పెట్టుకుని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను లాక్కునే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. తెలంగాణలో ప్రతి వారం ఒక్కో కుంభకోణం వెలుగులోకి వస్తోందన్నారు. గత ప్రభుత్వ కుంభకోణాలు బయట పడుతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడటం లేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఫోన్ ట్యాపింగ్‌ను రాజకీయంగా ఉపయోగించుకునే అవకాశం ఉందని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. సివిల్ సప్లైస్‌లో జరిగిన అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. అక్రమాలు, కుంభకోనాలు వెలుగులోకి వస్తున్నా సీబీఐ దర్యాప్తును రాష్ట్ర ప్రభుత్వం కోరకపోవడాన్ని ఆయన తప్పుబడుతున్నారు. సివిల్ సప్లైస్ కుంభకోణాన్ని సీబీఐతో దర్యాప్తు జరపాలన్నారు. అనేక ప్రముఖులు, జడ్జీలు ఫోన్ ట్యాపింగ్ అయ్యాయని వార్తలు వచ్చాయన్నారు. దుబ్బాక ఎన్నికల సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ట్యాపింగ్ చేశారని, డీజీపీపై ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని సీఎం రేవంత్ రెడ్డి చాలా తేలికగా తీసుకున్నట్లు కనిపిస్తోందన్నారు. రాష్ట్ర అవతరణ వేడుకలకు సోనియాగాంధీని పిలవడంపై రాష్ట్ర బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేస్తోందని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. వందల మంది బలిదానాలకు సోనియా గాంధీయే కారణమని, తెలంగాణ ప్రజలకు సోనియాగాంధీ క్షమాపణలు చెప్పి దశాబ్ది వేడుకలకు రావాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా వేడుకలు నిర్వహిస్తున్నపుడు అప్పటి ప్రధాని ,పార్లమెంట్‌లో మద్దతు ఇచ్చిన పార్టీలను ఎందుకు ఆహ్వానించడం లేదని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పాటుకు మద్దతు ఇచ్చిన పార్టీలను ఆహ్వానించనప్పుడు అది పార్టీ కార్యక్రమం అవుతుందన్నారు. బండి సంజయ్, కిషన్ రెడ్డి సహా అనేక మంది బీజేపీ నేతల ఫోన్లు కూడా ట్యాప్ అయ్యాయని, ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ దర్యాప్తు లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. గతంలో డ్రగ్స్, పేపర్ లీకేజీల, నయిమ్ వ్యవహారం వచ్చినపుడు వాటిని కేసీఆర్ రాజకీయంగా ఉపయోగించుకున్నారన్నారు. తెలంగాణ దశాబ్ది వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షం, ఉద్యమకారులు, తెలంగాణ వాదులతో చర్చలు జరపలేదని విమర్శించారు. సోనియాను పిలవడం ఆపి మిగతా పక్షాలతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరపాలన్నారు. రాష్ట్ర చిహ్నం బయటకు వచ్చిన తరువాత రాష్ట్ర బీజేపీ నాయకత్వం సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటుందని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ స్పష్టం చేశారు.

# ఎవరైనా నీటిని వృథా చేస్తే రూ.2000 జరిమానా.. ఢిల్లీ సర్కార్ నిర్ణయం



ఢిల్లీ: దేశ రాజధాని నగరంలో ఎండల తీవ్రత, పలుచోట్ల తాగునీటి కొరత వంటి పరిస్థితుల్ని అధిగమించేందుకు ఢిల్లీ ప్రభుత్వం కీలక చర్యలకు ఉపక్రమించింది. నీటి వృథాపై కొరడా ఝుళిపించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ఎవరైనా నీటిని వృథా చేస్తే రూ.2000 జరిమానా విధించనున్నట్లు మంత్రి అతిశీ తెలిపారు. నీటి పైపులతో కార్లను కడగడం, వాటర్ ట్యాంకర్లు ఓవర్ ఫ్లో కావడం, వాడుక నీటిని నిర్మాణ, వాణిజ్యపరమైన అవసరాల కోసం వినియోగించడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరించాలని అధికారుల్ని ఆదేశించారు. ఇందుకోసం ఢిల్లీ వ్యాప్తంగా 200 బృందాలను తక్షణమే ఏర్పాటు చేయాలని సూచించారు. మే 30న ఉదయం 8గంటల నుంచి ఈ బృందాల్ని రంగంలోకి దించేలా చర్యలు చేపట్టాలని ఢిల్లీ జల్‌బోర్డు సీఈవోకు రాసిన లేఖలో అతిశీ పేర్కొన్నారు. నిర్మాణ స్థలాలు, వాణిజ్య సంస్థల్లో ఏవైనా అక్రమ నీటి కనెక్షన్లు ఉంటే తొలగించాలని అధికారుల్ని ఆదేశించారు. హరియాణా నుంచి తమకు రావాల్సిన నీటి వాటా కోసం ఆప్ సర్కార్ పోట్లాడుతోంది. ఒకట్రెండు రోజుల్లో విడుదల చేయకపోతే న్యాయ పోరాటం చేస్తామని మంత్రి అతిశీ నిన్న చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఢిల్లీలో ఉన్న నీటి వనరుల్ని పొదుపుగా వాడుకోవడంపై దృష్టిసారించేందుకు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా నీటి వృథాను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారుల్ని మంత్రి ఆదేశించారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660